తీరనున్న ప్రయాణ కష్టాలు

- సోన్‌పెల్లి నుంచి సిరికొండకు బీటీరోడ్డు మంజూరు
- తగ్గనున్న దూరభారం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



సిరికొండ నుంచి సోన్‌పెల్లి వెళ్లే రోడ్డు

సిరికొండ: సిరికొండను మండలంగా ఏర్పాటు చేసి ఏడు సంవత్సరాలు అయింది. అయితే మండలంలోని సోన్‌పెల్లి గ్రామస్తులు మండల కేంద్రానికి చేరుకోవాలంటే దాదాపుగా 15 కిలోమీటర్లు దూరం తిరిగి రావాల్సి ఉంటుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా సోన్‌పెల్లి గ్రామం నుంచి సిరికొండ మండల కేంద్రానికి రూ. 2.30 లక్షల నిధులతో సుమారుగా 3.5 కిలోమీటర్లు బీటీరోడ్డును మంజూరు చేసింది. సోన్‌పెల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమయం వృథా..

ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యక్తిగత పనులకు మండల కేంద్రానికి చేరుకోవాలంటే సోన్‌పెల్లి గ్రామంతో పాటు ధోబిగూడ, ఇట్‌కార్ గూడ ప్రజలు ఇచ్చోడ మండలంలోని దాబా నుంచి మండలంలోని పోన్న ఎక్స్‌రోడ్డు మీదుగా తిరిగి రావాల్సి ఉంటుంది. సమయం వృథాతో పాటు ఆర్థికంగా ప్రజలు నష్టపోతున్నారు. దీనికి తోడు ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

15 కిలోమీటర్లు ప్రయాణం..

ప్రభుత్వం సోన్‌పెల్లి నుంచి మండల కేంద్రానికి బీటీరోడ్డు మంజూరు చేయడంతో సోన్‌పెల్లి, దోభిగూడ, ఇట్‌కార్‌గూడ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేవలం 3.5 కిలోమీటర్లు దూరానికి రోడ్డు సౌకర్యం లేక 15 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వచ్చేందన్నారు. రోడ్డు మంజూరుతో తమ కష్టాలు తీరనున్నాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ఇబ్బందులు పడ్డాం



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీరోడ్డు మంజూరుకు కృషి చేసిన బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గ్రామం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నాం. మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఎన్నో ఇబ్బందులుపడ్డాం. రోడ్డు మంజూరుతో మా కష్టాలు గట్టెక్కుతాయి. – కదం సూర్యకాంత్, సోన్‌పెల్లి

సంతోషంగా ఉంది



సిరికొండ నుంచి సోన్‌పెల్లి వరకు బీటీరోడ్డు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. అత్యవసర సమయంలో 108 వాహనం కూడా గ్రామానికి వచ్చే వీలు ఉండేది కాదు. రోడ్డు మంజూరుతో తక్కువ సమయంలో మండల కేంద్రానికి చేరుకోవచ్చు. – సిడాం జాకు, దోబిగూడ, సోన్‌పెల్లి, ఉప సర్పంచ్

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

సిరికొండ: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్, ఏఎస్సై శ్రీకాంత్, సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

బేల: గణేశ్ మండపాల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై రాధిక అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మండలపాల నిర్వాహకులు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో కచ్చితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. నిమజ్జన సమాచారం తెలియజేయాలన్నారు. డీజే సౌండ్స్‌కు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై జీవన్, విశ్వహిందూ ఉత్సవ సమితి మండల అధ్యక్షుడు రాపెల్లి శివకుమార్, ప్రధాన కార్యదర్శి కిరణ్ ముక్కవార్, ఉపాధ్యక్షుడు గుండవార్ అకాష్, గౌరే విశాల్, రాధే శ్యాం, కృష్ణ, రాము, హరిష్, రవి పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా నిలవడం అభినందనీయం



సరుకులు అందజేస్తున్న అనిల్ జాదవ్

నేరడిగొండ: నిరుపేదలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ అండగా నిలవడం అభినందనీయమని బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కుమారిలో పారిశుధ్య కార్మికులకు, నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని గుర్తించి సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఆదిలాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ గంగేశ్వర్, మండల రెడ్‌క్రాస్ సంస్థ కోఆర్డినేటర్ కుంట కిరణ్ కుమార్ రెడ్డి, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, పెంట వెంకటరమణ, సర్పంచ్ రాజు యాదవ్, నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఆలయాలకు మంజూరైన నిధుల పత్రాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. లఖంపూర్ రామాలయానికి రూ.50 లక్షలు, చిన్న బగ్గారంలోని జగదాంబ దేవి- సేవాలాల్ మహరాజ్ ఆలయానికి రూ.12 లక్షలు, కుంటాల జగదాంబ దేవి- సేవాలాల్ ఆలయానికి రూ.43 లక్షలు, గుడిహత్నూర్ మండలంలోని లింగాపూర్ హనుమాన్- శివాలయం కోసం రూ.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఐదు రోజులుగా అంగన్‌వాడీ టీచర్లు సమ్మె చేస్తున్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. అధికారుల ఒత్తిడితో ఉమ్రి కొలాంగూడ గ్రామానికి చెందిన ఆయమ్మ రంభబాయి ఆత్మహత్య చేసుకుందని, ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యభామ, హేమలత, రాధ, పుష్పలత, పార్వతి, మంజుల, లక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

ఆయా కుటుంబాన్ని ఆదుకోవాలి

కైలాస్‌నగర్: ఆత్మహత్యకు పాల్పడిన అంగన్‌వాడీ ఆయా కుటుంబానికి ఆదుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో రంభాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం గుర్తించాలి

గుడిహత్నూర్: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్ డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా వచ్చి, బస్టాండ్ ప్రాంగణంలో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ, ఆయా కార్యకర్తలు సమ్మె చేపడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఛాయ, ఇందుతాయి, సంగీత, లక్ష్మి, శ్రీకర్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యులతో నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

తాంసి: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో భీంపూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడుతూ.. బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు మీరాబాయి, జ్యోతి, సుమ, దేవత, నాగమ్మ పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ అడ్డగింత



వాహనాన్ని అడ్డుకున్న అంగన్‌వాడీలు

తాంసి: మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల పంపిణీ చేసేందుకు వచ్చిన కార్గో వాహనాన్ని అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. సమ్మెలో ఉంటే సరుకులు ఎవరూ తీసుకుంటారని ప్రశ్నించారు. వాహనానికి అడ్డుగా ఉండి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, గంగమ్మ, విజయలక్ష్మి, సంతోషిని, మమత పాల్గొన్నారు.

విత్తన గణపతుల పంపిణీ



గణపతులు పంపిణీ చేస్తున్న అనిల్‌జాదవ్

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె)లో శుక్రవారం గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా బోథ్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ విత్తన గణపతులను పంపిణీ చేశారు. అనిల్‌జాదవ్ మాట్లాడుతూ.. గత కొన్ని ఏళ్లుగా విత్తన గణపతులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: రైతులు పంటలకు పురుగుల మందు పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఐ అండ్ సేప్ ప్రాజెక్టు మేనేజర్ అశోక్ రెడ్డి, ట్రైనర్ మెస్రం ప్రసాద్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో టీఎంఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పురుగు మందు పిచికారీ చేసేటప్పుడు తప్పని సరిగా ముఖానికి మాస్క్ పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎదులాపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు అవినాశ్ అన్నారు. పట్టణంలోని భుక్తాపూర్‌లో ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కౌన్సిలర్ బండారు సతీశ్, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

62వ రోజుకు చేరిన దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని చేస్తున్న దీక్షలు శుక్రవారానికి 62వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సాయినగర్ కాలనీకి చెందిన యువకులు కూర్చున్నారు. డివిజన్‌గా మార్చే వరకు ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

బోథ్: బిల్లులు చెల్లించాలని, గౌరవ వేతనం ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద బైఠాయించారు. బిల్లులు చెల్లించే వరకూ మధ్యాహ్నం భోజనం వండేది లేదన్నారు.

మట్టి సేకరణ

బోథ్: ఢిల్లీలో నిర్మించే స్మృతి వనానికి మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో బీజేపీ నాయకులు శుక్రవారం మట్టి సేకరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు యాదవ్, బత్తిని ప్రవీణ్, ఆకుల రాజేందర్, కొమ్ము గోవర్ధన్, దాసరి చిన్నూ పాల్గొన్నారు.

సాయుధ పోరాటం చరిత్రలో మరువలేనిది

బోథ్: సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం మరచిపోలేనిదని నాయకులు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గోవర్ధన్, మండల కార్యదర్శి గోదావరి, నరేశ్, దాసు, భోజన్న పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జోగు రామన్నను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, కిష్టయ్య, అశోక్, రాజేశ్వర్ రెడ్డి, గోపీనాథ్ గౌడ్, జలంధర్, గంగన్న, భోజారెడ్డి, నరేందర్, రమేశ్ పాల్గొన్నారు.

ఎదులాపురం: సీపీఐ పార్టీలో 50 సంవత్సరాలకు పైగా పని చేసిన, తెలంగాణ సాయుధ పోరాటం పాల్గొన్న సీనియర్ నాయకులను శుక్రవారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో కుంటాల రాములు, ఎస్.అరుణ్‌కుమార్, రమేశ్, అమీనా ఖాన్, పొచ్చిరాం, గేడం కేశవ్, రాందాస్ పాల్గొన్నారు.

కార్యాలయాలను ఏర్పాటు చేయండి

బోథ్: సొనాల మండలం అయినందున కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి విన్నవించారు.

స్పాట్ కౌన్సెలింగ్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు ఈనెల 20న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంతకు ముందు దరఖాస్తు చేసుకొని, సీటు రానివారు కూడా ఈనెల 20 నుంచి 23 వరకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్, కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న రాథోడ్ రమేశ్

ఉట్నూర్‌రూరల్: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కోరారు. శుక్రవారం ఆయన నివాసంలో నూతనంగా నియమితులైన మండల ఉపాధ్యక్షులు లక్కాకుల భూపతి, కల్వ రవి, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేశ్‌లను సన్మానించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కొండేరి రమేశ్, కొలిపాక రాజశేఖర్, రాజలింగు, రామచందర్, లింగాగౌడ్, దేవదాస్, కిరణ్ పాల్గొన్నారు.

సమగ్ర ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రతను కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 18వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా ఉద్యోగులు సమ్మె శిబిరంలో మోకాళ్లపై కూర్చుని కళ్లకు, నోటికి నల్ల గుడ్డలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెంకటి పార్థసారథి, సోమన్న, విజయ్, శ్యాం, రేణుక మంజుల పాల్గొన్నారు.

‘ఆదిలాబాద్‌లో అభివృద్ధి శూన్యం’



మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అభివృద్ధిపై ప్రచారం చేయడమే కానీ, క్షేత్రస్థాయిలో అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. అభివృద్ధి పనులు పూర్తి కాకుండానే ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. కోర్టా- చనాక ద్వారా ఒక ఎకరానికైనా సాగునీరు అందిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.120 కోట్లు మంజూరు చేస్తే, రాష్ట్ర వాటాగా కేవలం రూ.30 కోట్లు తీసుకురాలేకపోయాడని అన్నారు. పట్టణంలోని కాలనీల్లో ఎక్కడా కూడా కనీస అవసరాలు కల్పించలేదన్నారు. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు. సమావేశంలో నాయకులు నారాయణ రెడ్డి, కొత్తపెల్లి సంతోశ్, సతీశ్‌రెడ్డి, తాటి సతీశ్, వెంకట్ రెడ్డి, భాగ్యలక్ష్మి, అశాంత్, సబ్దర్, కాంత, సరిత, వెంకటేశ్, లస్మారెడ్డి, మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం



నివాళులర్పిస్తున్న అధికారులు



నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం, కళాశాల ప్రిన్సిపాల్

ఎదులాపురం: సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ అన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నికల్ కళాశాలలో ఇంజనీర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు రాజ్ కుమార్, క్రాంతి కుమార్, సుజయ్, రాజన్న, సురేశ్, శ్రీనివాస్, ప్రవీణ్, రామేశ్వర్ రెడ్డి, యశశ్రీ, గజానంద్ రావు, సుధాకర్, రవికుమార్ పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

ఉట్నూర్‌రూరల్: ధవళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య పాత్ర ఏనలేనిదని ఐటీడీఏ ఏవో రాంబాబు అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఈ భీంరావు, ఏఈ సతీశ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠుగ్రస్తులు చికిత్స తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

తాంసి: కుష్ఠుగ్రస్తులు తగిన చికిత్స తీసుకోవాలని జిల్లా అదనపు వైద్యాధికారి శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్ఠునివారణ శిబిరం నిర్వహించారు. మండలంలోని 20 మంది అనుమానితులకు వైద్య పరీక్షలు చేశారు. ముగ్గురిని వ్యాధిగ్రస్తులుగా గుర్తించి మందులు పంపిణీ చేశారు. ఎలాంటి భయాందోళన చెందకుండా చికిత్స తీసుకోవాలని సూచించారు. ప్రతివారం ఆశ కార్యకర్తలు రోగుల ఇళ్లను సందర్శించి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, డీపీఎంవో వామన్ రావు, జ్ఞానేశ్వర్, గంగాధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లిష్ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్‌లో పీజీ, బీఎడ్‌లో ఇంగ్లిష్ మెథాడాలజీ, బోధనలో అనుభవం కలిగిన ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి బయోడేటతో ఈనెల 20లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మహగావ్‌లో ఇంటింటికీ తిరిగి యాంటి లార్వా సర్వే చేపట్టారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీటి నిల్వతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, అతిసారా వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త జాదవ్ జిజాబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కర్ర ఎడ్ల పండుగ



కర్ర ఎద్దుల ప్రతిమలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తున్న రైతులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో పొలాల అమావాస్య తర్వాతి రోజు నిర్వహించే కర్ర ఎడ్ల పండుగను శుక్రవారం రైతులు ఘనంగా జరుపుకున్నారు. కర్రతో చేసిన ఎడ్ల ప్రతిమలకు పూజలు చేసి, వాటిని తలపై మోస్తూ.. హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పరచ లావణ్య సాయన్న, ఉపసర్పంచ్ చట్ల విలాస్, చట్ల గజ్జయ్య, వినిల్, క్లాం భూషన్, కొంగర్ల శంభులింగు, రాజన్న, రాజు, రాములు పాల్గొన్నారు.

బీజేపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న రాజుయాదవ్

ఇచ్చోడ: బీజేపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజు యాదవ్ అన్నారు. శుక్రవారం ఇచ్చోడలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బీసీల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. సమావేశంలో స్వర్ణకారులు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, సంతోశ్, మానిక్‌రావు, ప్రవీణ్, కాంతయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎదులాపురం: కైలాస్‌నగర్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఓల్డ్ హౌజింగ్ బోర్డు, శాంతినగర్, ఏరోడ్రామ్, పాలిటెక్నిక్ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎస్ఈ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. జీఎస్‌నగర్ 33/11 కేవీ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా రాంపూర్, పొచ్చెర, దిమ్మ, జందాపూర్, భీంసరి గ్రామాలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందనినారు. అలాగే రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రణదీవెనగర్, ఖుర్షీద్‌నగర్, నీలనగర్, సుందరయ్యనగర్, రాంపూర్ రోడ్ ఏరియాలలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దొరికిన ఫోన్ అందజేత

బోథ్: బోథ్ మండల కేంద్రానికి చెందిన పాలిక్ నర్సయ్య శుక్రవారం ఉదయం తన ఫోన్‌ను బస్టాండ్ వద్ద పొగొట్టుకున్నాడు. కాగా లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్‌కు ఫోన్ దొరకడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఫోన్‌ను పాలిక్ నర్సయ్య అని గుర్తించి ఆయనకు అందజేశారు.